III

తెలంగాణ జైత్రయాత్ర 2023

నమస్తే తెలంగాణ

హైదరాబాద్ | ఆదివారం 19 నవంబర్ 2023 www.ntnews.com


యజ్ఞాలు, యాగాలు చేసేవారొకరైతే
క్షుద్రపూజలు చేసేవారొకరు
గుళ్లు, గోపురాలు కట్టే వారొకరైతే
వాటిని కూలగొడతామనే వాళ్లు మరొకరు
ప్రాజెక్టులు కట్టే వారొకరైతే
అవి దండుగ అనే వాళ్లు మరొకరు

ప్రాజెక్టులు, పథకాలు, జిల్లాలకు
దేవుళ్ల పేర్లు పెట్టేవారొకరైతే
తాత, ముత్తాతల పేర్లు పెట్టేవారొకరు
ముక్కంటి ఆశీర్వాదంతో ముచ్చటగా
మూడోసారి కేసీఆరే సీఎం

-బీఆర్‌కే విజయ ప్రతీక్

**91827 77222**

హ్యాట్రిక్ ఎలక్షన్- హ్యాట్రిక్ కేసీఆర్ కాన్సెప్ట్‌తో అసెంబ్లీ ఎన్నికల స్పెషల్ 'తెలంగాణ జైత్రయాత్ర'కు మీ నినాదాలు పంపాల్సిన వాట్సాప్ నెంబర్ ఇదీ.. మీ పేరు పంపడం మర్చిపోకండి.

## నాడు-నేడు

- వన దేవత గుడికి గ్రహణం
- నాగోబా కోవెల ఘనం



ఆదివాసీల ఆదిదైవం నాగోబా. సమైక్య పాలనలో అడవి బిడ్డల హక్కులను మాత్రమే కాదు, వారి దేవుడినీ పట్టించుకున్న పాపాన పోలేదు. లక్షలాది మంది నమ్ముకున్న దేవుడిని నిర్లక్ష్యం చేశారు. ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లి మండలం, కేస్లాపూర్ గ్రామంలోని ఆనాటి నాగోబా ఆలయ చిత్రమిది. కోనంతా విస్తరించిన దేవుడికి పది అడుగుల చోటు దక్కడమే మహాభాగ్యమైంది. మొక్కులు ఈడేర్చే దైవం పరిస్థితే ఇలా ఉంటే... అడవి తప్ప అన్యం ఎరుగని గిరి బిడ్డల గోడు విన్నదెవరు?



కేసీఆర్ ముఖ్యమంత్రి అయ్యాక అడవి బిడ్డలను అక్కున చేర్చుకున్నారు. వన సీమలో ఘనమైన కోవెలను నిర్మింపజేశారు. నాగోబా దేవాలయం కోసం బీఆర్‌ఎస్ సర్కారు రూ.6 కోట్లు మంజూరు చేసింది. మెస్రం వంశీయులు రూ.4.67 కోట్లు వెచ్చించారు. కఠినమైన శిలతో నాగోబా కొలువును అందంగా తీర్చిదిద్దారు. 2018లో చేపట్టిన నిర్మాణం 2022 డిసెంబర్ నాటికి పూర్తయ్యింది. నగిషీలు చెక్కిన స్తంభాలు, ముచ్చటైన గోపురం, అపురూప శిల్పాలు ఆదివాసీల వైభవాన్ని సగర్వంగా నిలబెట్టాయి.

# సిరుల పంటలు.. ధాన్యపు రాశులు

కరువును తరిమిన తుంగతుర్తి

నియోజకవర్గంపై నాటి పెద్ద నాయకుల నిర్లక్ష్యం

ప్రగతిబాట పట్టించిన యువ ఎమ్మెల్యే గాదరి కిశోర్

రెండు పంటలకు నీళ్లు... రికార్డు స్థాయిలో వరి సాగు

**కాంగ్రెస్ హయాంలో నీటి చుక్క లేక నెర్రెలు బారిన నేల తుంగతుర్తి. నాలుగు వందల ఫీట్ల లోతు బోర్లు వేసినా నీటి జాడ లేని నియోజకవర్గమిది. సాగునీటికే కాదు తాగునీటికి కూడా దశాబ్దాల తరబడి గోసపడ్డ ప్రాంతమిది. గుంతలు తేలిన సింగిల్ రోడ్లు, అరకొర మౌలిక సదుపాయాలతో అన్ని రంగాల్లోనూ ఈ నియోజకవర్గాన్ని వెనక్కు నెట్టేశారు నాటి పాలకులు.**

**2014లో రాష్ట్రంలో కేసీఆర్ పాలన రావడం, బీఆర్‌ఎస్ అభ్యర్థి గాదరి కిశోర్ ఎమ్మెల్యేగా గెలవడంతో తుంగతుర్తిలో అభివృద్ధి మొదలయ్యింది. పదేండ్ల బీఆర్‌ఎస్ పాలనలో నియోజకవర్గ రూపురేఖలే మారిపోయాయి. ఒకనాడు కరువు తాండవించిన ఈ నేలపై ఇప్పుడు రికార్డు స్థాయిలో వరి సాగు అయితున్నది. అన్ని రంగాల అభివృద్ధిలో ఇప్పుడు తుంగతుర్తి నెంబర్ వన్‌గా నిలుస్తున్నది.**



తుంగతుర్తి తడాఖా

వీరోచిత సాయుధ రైతాంగ పోరాటం చేసిన చైతన్యం తుంగతుర్తి ప్రాంతానిది. అయితే, దశాబ్దాల పాటు ఏలిన నాయకులు ఈ నియోజకవర్గాన్ని అభివృద్ధికి దూరం చేశారు. ఇక్కడ నాలుగుసార్లు ఎమ్మెల్యేగా గెలిచిన కాంగ్రెస్ నేత రాంరెడ్డి దామోదర్‌రెడ్డి రెండుసార్లు మంత్రిగా పని చేశారు. కానీ, అభివృద్ధిని మాత్రం ఆయన విస్మరించారు. రెండుసార్లు గెలిచిన సంకినేని వెంకటేశ్వరరావు, మోత్కుపల్లి నర్సింహులు హయాంలోనూ నియోజకవర్గం ఏమాత్రం అభివృద్ధి చెందలేదు. కేసీఆర్ పాలన మొదలైన తర్వాత కేవలం పదేండ్లలోనే తుంగతుర్తిలో అరవై ఏండ్లలో జరిగిన అభివృద్ధి కంటే అనేక రెట్లు ఎక్కువ జరిగింది. ఈ నియోజకవర్గంలో అభివృద్ధి, సంక్షేమానికి ప్రభుత్వం ఈ పదేండ్లలో దాదాపుగా రూ.6,000 కోట్లు ఖర్చు చేసింది. జరిగిన అభివృద్ధిని చూసే ప్రజలు రెండోసారి 2018లో గాదరి కిశోర్‌ను గెలిపించారు.

### కాళేశ్వరం జలాలతో కళ కళ

కేసీఆర్ ప్రభుత్వం తుంగతుర్తిలో కరువును తరిమికొట్టింది. రూ.18 కోట్లతో ఎస్సారెస్పీ కాల్వల ఆధునీకరణ చేసి కాళేశ్వరం జలాలు తీసుకువచ్చింది. దీంతో ఇప్పుడు ఇక్కడి ప్రతి పల్లెలు పచ్చని మాగాణంగా మారాయి. నెర్రెలు బారిన భూముల్లో సిరులు పండుతున్నాయి. మిషన్ కాకతీయతో 450 చెరువులకు పూర్వ వైభవం వచ్చింది. చెరువులు, కుంటలన్నీ నిండుకుండల్లా జలకళను సంతరించుకున్నాయి. రూ.59 కోట్లతో 6 చెక్‌డ్యాంలు నిర్మించారు. రూ.7.50 కోట్లతో శాలిగౌరారం ప్రాజెక్టుకు మరమ్మతులు చేశారు. కేసీఆర్ ప్రభుత్వం ఏర్పడకముందు నియోజకవర్గంలో ఎన్నడూ 17 వేల ఎకరాలకు మించి వరి సాగు జరగలేదు. నేడు 1,12,210 ఎకరాలు వరి సాగు అవుతున్నది. ఒకప్పుడు తిండి గింజలు దొరకని ప్రాంతంలో నేడు రెండు పంటలకు సరిపడా నీరు అందుతుండటంతో 10 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తున్నది.



ఎస్సారెస్పీ కాల్వలో పారుతున్న కాళేశ్వరం జలాలు

### గిదీ.. గాదరి అభివృద్ధి

- రూ. 310.33 కోట్లతో మిషన్ భగీరథ పనులు.
- రూ.44 కోట్లతో తుంగతుర్తిలో 100 పడకల దవాఖాన.
- రూ.3 కోట్లతో పాలిటెక్నిక్ కళాశాల నిర్మాణం.
- గురుకుల పాఠశాలలు, మాడల్ స్కూళ్లు, కస్తూర్బా గాంధీ పాఠశాలలు ఏర్పాటు. చేశారు.
- రూ.19.40 కోట్లతో డబుల్ బెడ్రూం ఇండ్ల నిర్మాణం.
- రూ.32.94 కోట్లతో వైకుంఠధామాల ఏర్పాటు.
- రూ.9.24 కోట్లతో పల్లె ప్రకృతి వనాలు.
- రూ.6.16 కోట్లతో రైతు వేదికల నిర్మాణం.
- కొత్త మండలాలుగా నాగారం, మద్దిరాల, అడ్డగూడూరు ఏర్పాటు.

### పదేళ్లలో ప్రగతి బాట..

**గతంలో** తుంగతుర్తిలో ఎమ్మెల్యేలుగా పని చేసిన పేరుకు పెద్ద నాయకులు చేయలేని అభివృద్ధి పనులను గాదరి కిశోర్ ఈ పదేండ్లలోనే చేసి చూపించారు. తిరుమలగిరి, మోత్కూర్‌ను మున్సిపాలిటీలుగా మార్చారు. నియోజకవర్గవ్యాప్తంగా రూ.232 కోట్లతో బీటీ రోడ్లు నిర్మించారు. తిరుమలగిరి మున్సిపాలిటీలో రూ.5 కోట్లతో పురపాలక భవనం, రూ.2 కోట్లతో సమీకృత మార్కెట్, రూ.30 కోట్లతో మంచినీటి ట్యాంక్, పైపులైన్ నిర్మాణం, రూ.3 కోట్లతో ఆడిటోరియం, రూ.2 కోట్లతో డంపింగ్ యార్డు, రూ.3 కోట్లతో సీసీ రోడ్లు, రూ.5 కోట్లతో సీసీ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణం, రూ.2 కోట్లతో బతుకమ్మ ఘాట్, కమ్యూనిటీ హాల్, సెంట్రల్ లైటింగ్ సిస్టంను ఏర్పాటు చేశారు. రూ.5.16 కోట్లతో గ్రామ పంచాయతీ భవనాల నిర్మాణం, రూ.6 కోట్లతో వసతి గృహాలు ఏర్పాటు చేశారు. అర్వపల్లిలో రూ.5 కోట్లతో యోగానంద లక్ష్మీనర్సింహస్వామి ఆలయ పునర్నిర్మాణం, రూ.1.55 కోట్లతో సబ్ మార్కెట్ యార్డు, రూ.3 కోట్లతో తుంగతుర్తిలో మార్కెట్ యార్డు నిర్మించారు. రూ.4.80 కోట్లతో మోత్కూర్‌లో మినీ ట్యాంక్‌బండ్‌ను అభివృద్ధి చేశారు. రూ.18 కోట్లతో గురజాల -మానాయికుంటపై బ్రిడ్జి నిర్మించారు. రూ.43 కోట్లతో మద్దిరాలలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మంజూరు చేయించారు.

ఫన్‌టాస్టిక్

## సెల్ఫ్ అవుటే... మా గేమ్‌ప్లాన్!

'**మీ స్ట్రాటజీ** ఏమిటో అర్థం కావడం లేదు. అసలే మీకు వెంకయ్య శిష్యుడు అనే పేరు ఉంది. ఆయన్ని రాజకీయాలకు దూరం పెట్టారని, మీరు పార్టీకి వెన్నుపోటు పొడుస్తున్నారేమో అని అనుమానంగా ఉంది సార్ ...'

'తమ్మీ... కమలం పువ్వు రెక్కలు రాలినట్టు, రాలిపోతున్న వాళ్లంతా వెన్నుపోటు... అని నన్ను తిడుతుంటే నీకూ అలానే అనిపిస్తుందేమో. అది సహజమే. ఈ కిషన్ రెడ్డి పెద్ద గేమ్‌ప్లాన్‌తో ఉన్నాడు. అది ఎవరికీ తెలియదు...'

'ఏమో సార్... అసలే మీకు మార్కెట్‌లో కుర్ కురే రెడ్డి అని పేరు. కరోనాలో దేశమంతా అల్లకల్లోలం అయితే మీరు కేంద్రమంత్రిగా కుర్ కురేలు పంచుతూ ఉన్నారని అంతా నవ్వుకుంటారు. మనం అధికారంలోకి వచ్చేస్తున్నామని నమ్మి హేమా హేమీలు ఎంతో మంది పార్టీలో చేరి, తీరా ఎన్నికలు ప్రకటించాక చెయ్యి ఇచ్చారు. మీడియా ప్రచారం తప్ప తెలంగాణలో కమలం ఎప్పుడో వాడి పోయిన పువ్వు అని గ్రహించి.. ఎంత స్పీడ్‌గా వచ్చారో అంతే స్పీడ్‌గా గోడ దూకి వెళ్లి పోయారు'

'పోతే పోనివ్వు తమ్మీ. కమలంలో మొదటి నుంచి ఉన్నవాళ్లే ఉంటారు. మధ్యలో వచ్చిన వాళ్ళు మధ్యలోనే పోతారు. బాల్ రెడ్డి , నరేంద్ర , నేనూ ...'

'ఆగన్నా ఆగు ... మీరు చెప్పిన వాళ్లు లేరు. వారి పేర్లు కూడా ఈ తరం ఓటర్లకు తెలియవు.'

'తెలియకపోతేనేం తమ్మీ... బంగారం, వజ్రాల విలువ మనకు తెలియనంత మాత్రాన వాటికి విలువ ఉండదా?'

'కానీ ప్రస్తుతం మనం గాజు ముక్కలను చూసి వజ్రాలు అని, కాకి బంగారాన్ని చూసి బంగారం అని భ్రమల్లో ఉన్నా మనిపిస్తుంది...'

'నువ్వేం కంగారు పడకు. నీ డిపాజిట్ డబ్బులు నేనిస్తాను'


'చూస్తుంటే... 119 మందికి డిపాజిట్ డబ్బులు మీరే ఇవ్వాల్సి వస్తుందేమో?'

'119 ఎందుకు ఇస్తాం. అందులో 8 మందికి పవన్ ఇవ్వాలి...'

'లెక్కలు బాగానే వేస్తున్నావన్నా... మన పరిస్థితి అంతేనా?'

'మనం లాస్ట్ బాల్‌ను అలానే రహస్యంగా ఉంచాం. లాస్ట్ బాల్ వేశారంటే అందరూ క్లీన్ బౌల్డ్ కావలసిందే. అదే కిరణ్ కుమార్ రెడ్డిని చివరలో రంగంలో దింపుతాం.'

'అవును. కిరణ్ కుమార్ రెడ్డి మన పువ్వు పార్టీలోనే ఉన్నాడు కదూ... మరిచే పోయాను'



'పెద్ద పెద్ద అస్త్రాలను చివరలో ప్రయోగిస్తారు. అందుకే కిరణ్‌ను ఇంకా యుద్ధ రంగంలోకి దించలేదు'

'అన్న... హస్తం వాళ్ళు లాస్ట్ బాల్ అని పి.చిదంబరాన్ని తీసుకుని వచ్చారు. ఆయన తెలంగాణ కోసం అమరులు అయిన వందలాది మందిని ఇప్పుడు గుర్తు చేసుకున్నారు. వారికి క్షమాపణలు చెప్పారు. కాంగ్రెస్ వాళ్లేమో తెలంగాణ మేమే ఇచ్చాము, అంటుంటే ఈయన అమరవీరులను గుర్తు చేస్తే... తెలంగాణ వారికి వారిని బలి తీసుకున్న కాంగ్రెస్ మీద కోపం రాకుండా ఉంటుందా?'

'నువ్వు ఎన్నయినా చెప్పు... కిరణ్ కుమార్ రెడ్డి లాస్ట్ బాల్ వేస్తారు. అంతా క్లీన్ బౌల్డ్ అవుతారు.'

'అవును. తెలంగాణ ఉద్యమ కాలంలో కూడా ఇలానే లాస్ట్ బాల్‌తో క్లీన్ బౌల్డ్ చేస్తాను అన్నారు. తనను సీఎంను చేసిన కాంగ్రెస్‌ను, తనను నమ్మిన వారిని క్లీన్ బౌల్డ్ చేసి సెల్ఫ్ అవుట్ అయ్యారు. ఇప్పుడు కిరణ్‌తో పాటు మీ బృందం అంతా కూడా అలాగే కావడం ఖాయం.'

■ మురళి

## ముందుకు పోదామా! ఎన్కకా!!



మైనారిటీల పక్షమని గప్పాలు పలికే కాంగ్రెస్.. వారిని ఓటు బ్యాంకుగా చూసిందే కానీ, నిరుపేద ముస్లింల కష్టాలు తీర్చే ప్రయత్నం ఎన్నడూ చేయలేదు. తెలంగాణ సాధన తర్వాతే రాష్ట్రంలోని మైనారిటీలకు మెజారిటీ సంక్షేమ ఫలాలు దక్కుతున్నాయి. ముస్లిం పేద కుటుంబంలో జన్మించిన ఆడపిల్లల వివాహం కోసం ప్రభుత్వం 'షాదీ ముబారక్' పేరిట 2014లో పథకం ప్రారంభించింది. తొలుత యాభై వేలుగా ఉన్న సాయం మొత్తాన్ని అనతి కాలంలోనే రూ.1,00,116కు పెంచింది. ఇప్పటి వరకు 2,68,535 మంది ఆడబిడ్డల పెండ్లికి రూ.2,688 కోట్లు ఇనాం అందించింది.

### ముబారక్ కేసీఆర్ సాబ్

**మాది** అంకుశాపూర్. మా నాన్న నా చిన్నప్పుడే సచ్చిపోయిండు. అమ్మ బీమారితోనే ఉంటుండే. మా అన్నలు అప్పులు చేసి ఆమెను దవాఖానల చూపిస్తుండే. వాళ్లే తిప్పలు పడి ఎట్లనో నా పెండ్లి చేసిన్రు. మా అత్తగారోళ్లు పేదోళ్లే. మా పెండ్లికి ముందే మా మామయ్య కాలం చేసిండు. మా ఆయన, మరిది టీ, అరటి పండ్లు అమ్మి ఇల్లు నడిపిస్తరు. నాకు పెండ్లయిన కొత్తల సీఎం సాబ్ షాదీ ముబారక్ పెట్టిండు. దస్తర్‌కు పోయి దరఖాస్తు పెట్టుకుంటే నాకు లక్ష రూపాయలు అచ్చినయ్. ఆ పైసలు బ్యాంకుల పెట్టుకున్నం. కొన్నొద్దులకు నాకు అబార్షన్ అయింది. బతుకుడే కష్టమన్నరు డాక్టర్లు. గా టైమ్‌ల షాదీ ముబారక్ పైసలే ఆదుకున్నయ్. మా ఆడబిడ్డ పెండ్లికి కూడా షాదీ ముబారక్ పైసలు అచ్చినయ్. ఆ పైసలతోనే కర్సులన్నీ ఎల్లినయ్. మా పేదింటి బిడ్డ పెండ్లికి మేనమామలా ఆదుకున్నడు ముఖ్యమంత్రి. బిడ్డ పుడితే తండ్రి లెక్క కేసీఆర్ కిట్ ఇస్తున్నడు. నాకు, మా ఆయనకు ఇద్దరికీ నాన్న లేడు. ఏ అండా లేదు. మాకు అన్నీ ముఖ్యమంత్రే! మా కుటుంబాన్ని నిలవెట్టిన కేసీఆర్ సాబ్‌కు మా ముబారక్.

• అజీజా సుల్తానా, గృహిణి, రామగుండం, పెద్దపల్లి జిల్లా

